# జర్మనీ కోర్సుల్లో 54 సీట్ల భర్తీ.. మిగిలిన సీట్లు 66



మాట్లాడుతున్న వీసీ టీకేకే రెడ్డి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ-జర్మనీ ఎంవోయూ కోర్సుల్లో భర్తీ అయిన వాటి కంటే మిగిలిపోయిన సీట్ల సంఖ్య ఎక్కువగా ఉంది. రెండు కోర్సుల్లో కలిపి మొత్తం 120 సీట్లు ఉండగా.. 54 భర్తీ కాగా.. 66 సీట్లు మిగిలిపోయాయి. బుధవారం వర్సిటీ ప్రవేశాల విభాగంలో కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి ముందుగా వీసీ డాక్టర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందడం ద్వారా గ్లోబల్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. సీఎస్ఈ, ఈసీఈలో మొత్తం 120 సీట్లు ఉండగా.. ఎప్‌సెట్, జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ పర్యవేక్షణలో సిబ్బంది విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా ఒక్కో కోర్సుకు 18 సీట్ల చొప్పున 36 సీట్లు కేటాయించగా.. ఇందులో కేవలం సీఎస్ఈలో మూడు సీట్లు భర్తీ కాగా.. 33 సీట్లు మిగిలిపోయాయి. ఈసీఈలో ఒక్క సీటు కూడా భర్తీ కాలేదు. ఎప్‌సెట్ ర్యాంకుల ద్వారా ఒక్కో కోర్సులో 42 చొప్పున 84 సీట్లు కేటాయించగా.. ఇందులో సీఎస్ఈలో అత్యధికంగా 35, ఈసీఈలో 16 సీట్లు భర్తీ అయ్యాయి.

# జేఎన్‌టీయూహెచ్ అడ్మిషన్స్ విభాగంలో కౌన్సెలింగ్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్, జర్మనీలోని నాలెడ్జ్ ఫౌండేషన్ రాయింట్లింగెన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ ప్రోగ్రామ్' కోర్సులకు బుధవారం వర్సిటీలోని అడ్మిషన్స్ విభాగంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎప్‌సెట్ నుంచి జేఈఈలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరయ్యారు. 120 సీట్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీట్లు భర్తీ చేసేందుకు వర్సిటీ యంత్రాంగం ఉత్సాహం చూపినా ఆశించిన మేర స్పందన రాలేదు.

## పీహెచ్‌డీ నిబంధనలు పాటించాలి

జేఎన్‌టీయూహెచ్ పీహెచ్‌డీ స్కాలర్‌గా అడ్మిషన్ సమయంలో సమర్పించిన పత్రాల పరిశీలించి పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ నిబంధనలు అమలవుతున్నాయా? లేదా? అనే విషయాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరుతూ పీహెచ్‌డీ విద్యార్థి దిలీప్ బుధవారం ఆర్అండ్‌డీసెల్ డైరెక్టర్ సత్యసావిత్రికి వినతిపత్రం అందజేశారు. పరిశోధక విద్యార్థులు చల్లా రామకృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థులు జయరాం, సాయిరాం పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

# జర్మనీలో బీటెక్ ప్రవేశాలకు జేఎన్‌టీయూలో కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జర్మనీ విశ్వవిద్యాలయాలతో కలిసి జేఎన్‌టీయూ నిర్వహిస్తున్న బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. యూనివర్సిటీ అడ్మిషన్ల విభాగంలో బుధవారం జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియను వైస్‌చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ బాలునాయక్ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది జర్మనీ బీటెక్ కోర్సుల్లో 33మంది చేరగా, ఈ ఏడాది 54 అడ్మిషన్లు తీసుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల నుంచి డిమాండ్ పెరిగితే రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.